

'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' : ఎంపీడీవో అప్పలనాయుడు

విశాలాంధ్ర - జలుమూరు : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం మండల కేంద్రం జలుమూరు ఎస్ఏఎస్ఏ ప్రోగ్రాంలో ఉదయం 9 గంటలకు జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి కే.అప్పలనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, ఎన్ఈఆర్జీఎస్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు అందరూ జలుమూరు ఆసుపత్రి జంక్షన్ వద్దకు చేరాలని ఆయన కోరారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

సీపీఐ పలాస నియోజకవర్గ కన్వీనర్ చాపర డిమాండ్

విశాలాంధ్ర - పలాస : ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని పలాస నియోజకవర్గం సిపిఐ కన్వీనర్ చాపర వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పలాస నియోజకవర్గం పరిధిలో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ, వజ్రపుకొత్తూరు, మందస, పలాస మండలాల్లో 2014 టిడిపి పాలన కాలం నుంచి నేటి వరకు గత 11 సంవత్సరాలుగా టీడీపీ, వైసీపీ పార్టీల ఆధ్వ ర్యంలో ఆయా పార్టీల కార్యకర్తలు, చోటా నాయకులు భూకబ్జాలకు పాల్పడి ప్రకృతి వనరులను, సంపదను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో అటవీ శాఖ భూములు, కొండలు, ఇరిగేషన్ శాఖకు చెందిన సాగునీటి వనరులు, కాలువలు, చెరువుల గర్భాలు కబ్జా చేసి కోట్లాది రూపాయలు ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు పార్టీలు పారదర్శక పాలన ప్రజలకు అందకుండా డ్రామా ఆడుతున్నారని విమ ర్శించారు. 2023 పలాసలో అప్పటి జిల్లా జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో అప్పటి పలాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి డా. అప్పలరాజు రెవెన్యూ దర్బారు ఏర్పాటు చేశారని, ఈ దర్బారులో టిడిపి ప్రభుత్వ పాలనలో జరిగిన భూ ఆక్రమ ణలపై భూ కబ్జాలపై వైసిపి నాయ కులు ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. భూ కబ్జాలపై తెలుగుదేశం పార్టీ నాయకులు, వైసిపి నాయకులు ఒకరిపై ఒకరు కబ్జాలు తొలగిం చాలని ఫిర్యాదులు చేసుకుంటు న్నారని, ఆయా పార్టీల నాయకులు తగిన సాక్ష్యాధారాలతో భూకబ్జాలపై ఫిర్యాదు చేసిన ఇంతవరకు దర్యాప్తులు లేవని, చర్యలు శూన్యం అని విమర్శించారు. ఇరు పార్టీల ఫిర్యాదులను రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు బుట్ట దాఖలు చేస్తున్నారని ఆరోపించారు. మళ్లీ ఇప్పుడు టిడిపి, వైసిపి పార్టీలు పాత కథనే తెర మీదకు తెచ్చి భూ కబ్జాలపై ఇరు పార్టీలు సంబంధిత శాఖలకు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. భూ ఆక్రమణలు తొలగించకుండా రెవిన్యూ యంత్రాంగంపై బెదిరింపులు చేస్తున్నారని రాజకీయ ఒత్తిడి తెస్తున్నది కూడా వీరేనని ఆరోపించారు. పలాస నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయకుండా ప్రజా సమస్యలను పట్టించుకోకుండా భూ కబ్జాల ఫిర్యాదు విషయాన్ని తెరమీదకు తెచ్చి ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని ఇరు పార్టీలు భూకబ్జాలకు పాల్పడి ఒకరి పైన ఒకరు ఫిర్యాదు చేసుకోవడం విచిత్రకరంగా ఉందని అన్నారు. ఇరు పార్టీలు భూకబ్జాలపై చేసిన ఫిర్యాదులు చూస్తుంటే రెండు పార్టీలు చెందిన కార్యకర్తలు, చోటా నాయకులు దొంగలు, దొంగలు ఊళ్ళు పంచుకున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. కబ్జాలపై రెండు పార్టీల నాయకుల ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం సమగ్రమైన దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం పలాస నియోజకవర్గం భూకబ్జాలకు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో మరిన్ని భూకబ్జాలు పెరిగే అవకాశం ఉందని ప్రజలకు రక్షణ లేకుండా పోతుందని, ప్రభుత్వ ఆస్తులు కాపాడాలని కోరారు.

బీచ్‌ల అభివృద్ధికి ఇది నాంది ప్రస్థానం : ఎమ్మెల్యే డాక్టర్ అశోక్

విశాలాంధ్ర - సోంపేట : బారువలో శని, ఆదివారాల్లో నిర్వహించనున్న కార్యక్రమం వాస్తవంగా బీచ్ ఫెస్టివల్ కాదని ప్రభుత్వ విప్,ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ పేర్కొన్నారు. ఆయన శు క్రవారం బీచ్‌లో బారువ గ్రామస్తులు, కూటమి నేతలు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అతి తక్కువ సమయంలో వాతావరణం అనుకూలించని సమయంలో బీచ్‌ఫెస్టివల్ నిర్వహించుకోవడం సరి కాదని అయితే ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉన్న అతిముఖ్యమైన 5 బీచ్ ప్రాంతాలను టూరిజం పార్కు ఆధ్వర్యంలో మరింతగా అభివృద్ధి చేసుకోవాలన్న సంకల్పంతో బీచ్ ఫెస్టివల్ పేరుతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. డొంకూరు, కొత్తపాలెం, ఇద్దివానిపాలెం, కళింగపట్నం, బారువ, ఎకువూరు బీచ్‌లను మరింత సుందరంగా తీర్చిదిద్ది రాబోవు కాలంలో ఇక్కడ కూడా సందర్శకుల రాకను మరింతగా పెంచాలన్న ఆలోచనతో అందంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మొట్టమొదటిసారిగా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఫెస్టివల్ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్వల్ప వ్యవధి అయినప్పటికీ బోటు షికార్లు, స్టాల్స్, రెస్టారెంట్లు, క్రీడలు, ఈవెంట్స్ మొదలైన వాటితో సందర్శకులను ఆకట్టుకునేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో టూరిజం, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల నిర్విరామ కృషితో నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. అలాగే పర్యావరణానికి ఎంతగానో దోహదపడే ఆలివ్‌రిడ్లే తాబేళ్ల పిల్లలను మత్స్యశాఖ ఆధ్వర్యంలో పెంపకం జరుగుతుందని వాటిని తిరిగి సముద్రంలో విడిచిపెట్టే కార్యక్రమం శనివారం ఉదయం 5 గంటలకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇటువంటి ప్రాధాన్యత గల కార్యక్రమానికి మహోదయం కార్యక్రమం మాదిరిగా ఈ ప్రాంతీయులంతా వేకువజామున హాజరు కావాలని ఎమ్మెల్యే అశోక కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు చిత్రాడ శ్రీనివాస్, నిట్ట గోపాల్, మద్దు కుమార్, మద్దు గురుమూర్తి, సూరాడ చంద్రమోహన్ తదితరులు హాజరయ్యారు.

కలెక్టర్ పర్యవేక్షణలో ఏర్పాట్లు : బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక పర్యవేక్షణలో పలాస ఆర్‌డిఓ వెంకటేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ, టూరిజం, మత్స్యశాఖ, పోలీస్, పంచాయతీరాజ్‌శాఖల ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఏర్పాట్లు జరిగాయి.

జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీలో నవ్య ప్రతిభ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి /కోటబొమ్మాళి : ఆలివ్ రిడ్ల తాబేళ్ళ సంరక్షణ పై అవగాహనకై జిల్లా స్థాయిలో విద్యాశాఖ శు క్రవారము నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని నందిగాం నవ్య ద్వితీయ బహుమతి పొందింది. బారువ బీచ్ లో శనివారం జరగనున్న ఆలివ్ రిడ్ల తాబేళ్ళ పండుగ కార్యక్రమంలో భాగంగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, తదితరుల చేతుల మీదుగా నవ్య బహుమతి అందుకోనుంది. ఈ సందర్భంగా విద్యార్థిని నవ్యకు అలాగే ఆమెకు తర్ఫీదు ఇచ్చిన చిత్ర లేఖనం ఉపాధ్యాయుడు జి.పాపారావుకు మండల విద్యాశాఖ అధికారులు సిహెచ్ గోవింద, ఎల్వి ప్రతాప్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. గోవిందరావు, ఇతర ఉపాధ్యాయులు అభి నందించారు. విద్యార్థిని ఎంపిక పట్ల మండల విద్యా శాఖ అధికారి ఎల్వి ప్రతాప్ అభినందించారు.

గుండెపోటుతో వంశధార ఉద్యోగి మృతి

విశాలాంధ్ర - నరసన్నపేట : స్థానిక మారుతీనగర్-1వ వీధిలో నివాసం ఉంటున్న వంశధార శాఖలో పనిచేస్తున్న ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు టెక్కలి వంశధార శాఖలో అటెం డెర్‌గా పని చేస్తున్న కొర్రాయి వెంకటరమణమూర్తి(57) గత కొన్నేళ్ళుగా గుండె సంబంధిత వ్యాధితో సతమతమవుతున్నారని అన్నారు. ఈనెల 14వ తేదీన తన గృహంలో పడుకున్న వ్యక్తి 17వ తేదీ వరకూ బయటకు రాలేదు. దీనితో పాటు ఇంటి నుండి దుర్గంధం రావటంతో స్థానికులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఇంటి తలుపులు తెరిచి లోపలికి వెళ్ళే సరికి, మంచం మీద మృతి చెంది ఉన్నారని తెలిపారు. మృతుడు వెంకటరమణమూర్తికి భార్య పది సంవత్సరాల క్రితం మృతి చెందిందని, కూతురుకు పెళ్ళి చేసి, బెంగుళూరులో భర్త దగ్గర ఉందని, కొడుకు విశాఖపట్నంలో చోళమండలం ఫైనాన్స్ కంపెనీలో రికవరీ అధికారిగా పనిచేస్తున్నారని అన్నారు. మృతుడు కుమారుడు, అనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.ఐ, సిహెచ్.దుర్గాప్రసాద్ నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తాం

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజలకు మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నానని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం 27వ వార్డు భద్రం కోనేరు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నానని ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న భద్రం కోనేరు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి మున్సిపల్ సాధారణ నిధులు 27 లక్షల రూపాయలతో నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏ పి టి పి సి చైర్మన్ వజ్జ బాబురావు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, టిడిపి నాయకులు లోడగల కామేశ్వరరావు యాదవ్, కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బద్రి గోపాల్, కొరికాన శంకర్, టంకాల రవిశంకర్ గుప్తా, మల్లిపెద్ది చిన్ని, సప్ప నవీన్, ధనియాల నరసింహులు, మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ మున్సి పాలిటీ లేబర్ కాలనీలో ఉరి వేసుకుని యువ కుడు ఆత్మహత్య కు పాల్పడిన ఘటన ఆ కుటుం బంలో తీవ్ర విషాదాన్ని నింపింది.లేబర్ కాలనీ లోని తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆటో డ్రైవర్ కొవ్విరి సాయి కుమార్ (21) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. విగత జీవిగా వేలాడు తున్న సాయి కుమార్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ పోలీసులు ఆస్పత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. తీవ్రమైన కడుపునొప్పి తాళలేక సాయి కుమార్ బలవన్మరణానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు తెలుస్తోంది. మృతదేహంను పోస్టుమార్టం కోసం మార్చురీ గదికి తరలించిన పోలీసులు మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ వెల్లడించారు.

భక్తి శ్రద్ధలతో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని గోవిందపుట్టుగ గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో భకి శ్రద్ధలతో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వేకువ జాము నుండి విశేష పూజలు చేపట్టిన అనంతరం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు.

ప్రభుత్వ విప్ అశోక్‌కు బెలగాం గ్రామస్తులు కృతజ్ఞతలు

విశాలాంధ్ర - కవిటి : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్‌కు బెలగాం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు శు క్రవారం రామయ్యపుట్టుగ ప్రభుత్వ విప్ క్యాంతోపాటు కార్యాలయం వద్ద ఆయనను బెలగాం గ్రామస్తులు మృత్యుంజయ పట్నాయక్, మణిచంద్ర ప్రకాష్, రంగా రౌలో, సంతోష్ కుమార్ పట్నాయక్, మోహనరావు తోపాటు పలువురు కూటమి నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. బెలగాం నాయకులపై మమ కారంతో ఏఎంసి చైర్మన్ పదవి మణి చంద్రప్రకాష్‌కు దక్కటం కూటమి నాయకుల్లో హర్షం వ్యక్తం అవతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు బెందాళం రమేష్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సమీక్ష

విశాలాంధ్ర - సోంపేట : స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎక్సైజ్‌తో పాటు వివిధ విభాగాల అధికారులతో చేపట్టిన సమీక్షలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నవోదయం 2 గురంచి అన్ని వివరాలు సేకరించారు. ఆయా దత్తత గ్రామాల అధికారులతో ఆయా గ్రామాల్లో ఉన్న పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనేక గ్రామాల్లో నాటుసారా ఉండడానికి వీల్లేదని చెప్పారు. అటువంటి కేసులు ఎక్కడ నమోదైనా భవిష్యత్తులో ఆ అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ కె.బేబి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్షీణ సంస్కృతికి, యుద్ధాలకు వ్యతిరేకంగా ఇస్కఫ్ కృషి

ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి సనపల నర్సింహులు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : క్షీణ సంస్కృతికి, యుద్ధాలకు వ్యతిరేకంగా, ఇరుగు పొరుగు దేశాలతో స్నేహ సంబంధాల కోసం భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) కృషి చేస్తున్నదని ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి సనపల నర్సింహులు అన్నారు. స్థానిక ఎన్ఆర్ దాసరి క్రాంతి భవన్ లో శు క్రవారం ఇస్కఫ్ జిల్లా కార్యవర్గ సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక అనిశ్చిత కాలాన్ని ప్రపంచం ఎదుర్కొంటోందని రష్యా - ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్ - పాలస్తీనా పోరు, ఇంకా వివిధ దేశాలలో జరుగుతున్న అంతర్గత విభేదాలను వివరించారు. ప్రపంచం పురోగమనం సాధించాలంటే యుద్ధాల ద్వారా కాదని, శాంతి, పరస్పర గౌరవం, సంభాషణల ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని అయన స్పష్టం చేశారు. ఇస్కఫ్ గౌరవ అధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఇది ఒక ప్రమాదకరమైన భూమి అవ్వకూడదంటే యుద్ధాలు లేని ప్రపంచం, ప్రజా సంస్కృతీ, కళలు అవసరమని తెలిపారు. ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.వి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఇస్కఫ్ సభ్యులును చేర్పించి అభివృద్ధికి అందరు కృషి చేయాలని కోరారు. ఈ నెల 26,27 న అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరగనున్న రాష్ట్ర మహాసభలను జైప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.వి.నాగ భూషణరావు, సీనియర్ సభ్యులు కొమర భాస్కరరావు, చిక్కాల గోవిందరావు, బి.వి.ఎస్.ఎన్.రాజు, రౌతు శంకరరావు, పేడాడ హేమసుందరరావు, పొడుగు రాజు తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించండి

ప్రభుత్వ విప్ అశోక్‌కు వెల్ఫేర్ అసిస్టెంట్ల వినతి

విశాలాంధ్ర - కవిటి : సచి వాలయాల్లో విధులు చేప డుతున్న వెల్ఫేర్ అసిస్టెంట్లకు పదో న్నతి కల్పించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశో క్కు వెల్ఫేర్ అసిస్టెంట్లు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం రామయ్య పుట్టుగ ప్రభుత్వ విప్ అశోక్ క్యాంప్ కార్యాలయంలో విద్య మరియు క్యాంప్ సహాయకులు (వెల్ఫేర్ అసిస్టెంట్లు) మర్యాదపూర్వకంగా కలిసి తమ డిపార్ట్మెంట్ వారికి పదోన్నతులు కలిపించాలని, సీనియారిటీ లిస్ట్ ప్రకటించాలని మరియు సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ ఇవ్వాలని కోరారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల వెల్ఫేర్ అసిస్టెంట్లు స్థానిక ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాలం అశోక్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు విప్ డాక్టర్ బెందాళం అశోక్ సానుకూలంగా స్పందిస్తూ అందరికీ తగు న్యాయం జరుగుతుందని, ప్రభుత్వం వీటి అన్నిటిపై దృష్టి పెట్టిందని అధైర్య పడద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గానికి చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్లు బి.రమేష్, రంగారావు, వాసు, వెంకటరావు, రవితేజ, యాదవరావు, కర్ణరావు, పందిరి రమేష్, నూకరాజు, రవిప్రకాష్, చంద్రశేఖర్, భూషనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు

విశాలాంధ్ర - మందస : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు అన్నారు. శుక్రవారం మండలం భేతాళ పురం గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారాన్ని తెలియపరచకూడదని, తెలియని నెంబర్ల నుండి ఫోన్ కాల్ వచ్చినప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. తెలియని లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, గ్రామాలలో బాల్యవివాహాలు జరిపితే సమాచారం అందించాలన్నారు. రోడ్డుపై ప్రయాణం చేస్తున్నప్పుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపు రాదని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆయన వెంట మందస ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్, పలువురు పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రజలంతా ప్రశాంతంగా జీవించాలి

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : ప్రజలంతా ప్రశాంతంగా, శాంతియుతంగా జీవించాలని ఎంఎల్ఏ గౌతు శిరీష అన్నారు. శుక్రవారం మండలం నువ్వలరేవు గ్రామస్తులంతా ఐకమ త్యంతో జరుపుకున్న శాంతి హెూమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె బృందావతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం శాంతి హెూమంలో పాల్గొని శివునికి అభిషేకం చేశారు.గ్రామస్తులందరికి మేలు కలగాలనే ఉద్దేశంతో అందరూ కలిసి సామూహికంగా ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడంలో నువ్వలరేవు గ్రామ ప్రజలు ఎప్పుడు తమ ప్రత్యేకత చాటుకుంటున్నారని కొనియాడారు.ఆనందమయ జీవితానికి సామూహిక కార్యక్రమాలు ఎంతో తోడ్పడతాయని ఆమె అన్నారు. గ్రామ ఐక్యత అభివృద్ధి కోసం 23 ఏళ్ళ తరువాత మళ్ళీ భారీ స్థాయిలో హెూమం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మువ్వల పూర్ణ చంద్ర రావు, టీడీపీ మండల అధ్యక్షులు సురాడ మోహనరావు, గోవింద పాపారావు, ఉమా మహేశ్వర్ రావు, కధంబాల వెంకట రమణ, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, ఆనంద్ పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న ప్రతిపక్ష నేత

సర్పంచ్ మురిపాల కుమారి కాళీ ప్రసాద్

విశాలాంధ్ర - కవిటి : గత 12 ఏళ్లుగా ప్రజలకు సేవలు చేసేందుకు రాజకీయ ప్రవేశం చేశానని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి చేద్దామని పనులు నిర్వహిస్తుంటే స్థానిక ప్రతిపక్ష నేత అడ్డుకుంటున్నారని సర్పంచ్ మురిపాల కుమారి కాళీ ప్రసాద్ మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం లండారి పుట్టుగ సర్పంచ్ మురిపాల కుమారి కాళీ ప్రసాద్ తన నివాసం కొండిపుట్టుగ గ్రామంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత 12 ఏళ్లుగా ప్రజలకు మంచి చేద్దామని రాజకీయ ప్రవేశం చేస్తే 2013 సర్పంచ్ ఎన్నికల్లో ఓటమిపాలయ్యానని తర్వాత ఎన్నికల్లో పోటీ చేసి స్వల్ప ఆదిక్యంలో గెలుపు సొంతం చేసుకున్నానని తెలియజేశారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు తాను చేసే అభివృద్ధి పనులకు స్థానిక ప్రతిపక్ష నేత అడ్డుకుంటున్నారని అధికారులతో జులుం ప్రదర్శించి తన మాటని నెగ్గించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీ వల పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులు ప్రారంభోత్సవానికి సర్పంచ్ కు ఆహ్వానం లేదని పిచ్చుకపై బ్రహ్మాస్త్రం అనే చందంగా క్షేత్రస్థాయి అధికారులకు బెదిరించి తన పంచాయతీ అభివృద్ధికి అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. బటన్ నొక్కానని ప్రజలను మోసం చేస్తూ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మళ్లిస్తూ ప్రజలకు మోసం చేసే వైసిపి ప్రభుత్వం కాదని కూటమి ప్రభు త్వంలో అభివృద్ధికి చోటు ఉంటుందని హితవు పలికారు. ప్రతిపక్ష నేత ప్రలోభాలకు లొంగకుండా ప్రభుత్వ యంత్రాంగం అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకురాలు కోరాడ లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీటీడీ గోమరణాలపై భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం

- మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర
- టీటీడీ ప్రతిష్ఠ దెబ్బతీస్తున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలి
- ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై భూమన కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. 'అదో నల్లరాయి దాని మీదకు చెప్పు విసిరితే ఏమవు తుందంటూ' గతంలో వెంకటేశ్వర స్వామిపై అనేక విమర్శలు చేసిన కరుణాకర్ రెడ్డి మరోసారి దుష్ప్రచారానికి తెరలేపి మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర చేస్తున్నారని తెలిపారు. అలజడి సృష్టించేందుకు, ప్రశాంతతకు భంగం కలిగించేందుకు టీటీడీపై రోజుకో తప్పుడు ప్రచారం చేస్తు న్నారన్నారు. కోటిమంది దేవతలతో సమానంగా భావించే గోమాతలపై కూడా అసత్య ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించేందుకు కుట్రలు చేస్తున్నారు. 100 ఆవులు చనిపోయా యంటూ కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తి అవాస్తవం అని, గోశాలలోని ఆవులు వృద్ధాప్యం, డెలివరీ సమయంలో, వ్యాధులతో నెలకు సగటున 10 ఆవుల వరకు మృత్యువాత పడు తుంటా యన్నారు. ఇవి గత అయిదేళ్ల గణాంకాలు చూస్తే స్పష్టమవు తుందన్నారు. ఇప్పుడు గడిచిన మూడు నెలల్లో వృద్ధాప్యం, వ్యాధులు వంటి కారణాలతో 40 ఆవులు మృత్యువాత పడడం జరిగిందని, కరుణాకర రెడ్డి ప్రెస్ మీట్ లో చనిపోయినట్లు చూపించిన ఆవుల ఫోటోలు ఇక్కడివి కాదు, ఎక్కడివో.. వాటిని అడ్డుపెట్టుకుని టీటీడీ పై తప్పుడు ప్రచారం చేస్తున్నా రన్నారు. జనన, మరణాల రిజిష్టరును గోసంరక్షణ శాలలో ప్రతిరోజూ క్రమం తప్పకుండా నమోదు చేస్తున్న విషయం తెలిసి కూడా దురుద్దేశ పూర్వ కంగా రిజి స్టరులో నమోదు చేయడం లేదంటూ వ్యవ స్థపై తప్పుడు ప్రచారం చేయడం సబబు కాదన్నారు. లేగదూడలను పసిబిడ్డలుగా భావిస్తూ గోశాల సిబ్బంది సేవలందిస్తున్నారన్నారు. నేను నాస్తికుడినని స్వయంగా కరుణాకరరెడ్డి ప్రకటించుకున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వెంకటే శ్వర స్వామిదే ముంది ఒక నల్ల రాయి దానిని పెకిలించేస్తానంటూ గతంలో కరుణాకరరెడ్డి ప్రక టించ లేదా అంటూ ప్రశ్నించారు. కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్ గా పనిచేసిన సమ యంలో ప్లాస్మా టీవీల కుంభ కోణం, తాళిబొట్ల కుంభకోణం, టిక్కెట్లు అమ్ముకోవడం, డాలర్లు మాయం చేయడం వంటి దుశ్చర్యలకు పల్పడ్డారన్నారు. కోవిడ్ సమయంలో స్వామి వారి ప్రసాదాలను కూడా దారిమళ్లించి అపచారాలకు పాల్పడిన చరిత్ర కరుణాకరరెడ్డిది అన్నారు. కరుణాకరరెడ్డి కుమార్తె నీహారెడ్డి పెళ్లిని క్రైస్తవ మత ఆచారాలతో చేసిన మాట వాస్తవం కాదా అన్నారు. గోసంరక్షణ శాలపై తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు గోవుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై క్రమం తప్పకుండా సమీక్షించడం జరుగుతుందనీ, టీటీడీ గోశాలలో 260 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తూ గోవుల సంరక్షణను సక్రమంగా చూసు కుంటుంటే టీటీడీ పట్టించుకోవడం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. గోశాలలోని 2,668 ఆవులకు జియో ట్యాగ్ చేసి ప్రతిరోజూ పర్యవేక్షించడం జరుగుతుంటే ఆవులకు జియోట్యాగ్ తీసేశారంటూ విష ప్రచారం చేస్తున్నారనీ మండిపడ్డారు. గోశాలను గత ప్రభుత్వ హయాంతో పోల్చుకుంటే ఇప్పుడు అధునాతన సదుపాయాలు ఏర్పాటు చేయడంతోపాటు ప్రతిరోజూ శుభ్రపరచడం, బ్లీచింగ్ చేయడం జరుగుతుందన్నారు. గోశాలను సందర్శించిన భక్తులు సైతం సంతృప్తి వ్యక్తం చేస్తుంటే ఇక్కడ పరిశుభ్రత లేదంటూ తప్పుడు ప్రచారం చేయడం, చనిపోయిన ఆవులకు పోస్టుమార్టం చేయడం లేదు అంటూ అర్థరహిత విమర్శలు చేస్తున్నారన్నారు. కరుణా కరరెడ్డి అవినీతి, అక్రమాలతో టీటీడీ ఖజానాను దారి మళ్ళించి కమిషన్లు కొట్టేశారని విమర్శించారు. తిరుపతి కొండపై అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించింది, ఏడుకొండలను 5 కొండలుగా మార్చే కుట్ర చేసింది, టీటీడీని కూడా ప్రైవేట్ లిమిటెడ్ గా మార్చే చర్యలకు పాల్పడింది నువ్వు కాదా అంటూ కరుణాకరరెడ్డి ని ప్రశ్నించారు. చేసిన తప్పుడు పనులకు విధుల దూరం అయిన హరనాధ్ రెడ్డి అనే వ్యక్తి కోసం టీటీడీ పై తప్పుడు ప్రచారాలు చేయడం మంచిది కాదని హెచ్చరించారు. టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించేలా అసత్య ఆరోపణలు చేస్తున్నందుకు చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టాలని ప్రకటనలో కోరారు.

అగ్ని ప్రమాదాల నివారణపై తెలుసుకోవాలి

విశాలాంధ్ర - రణస్థలం : ఫైర్ వారోత్సవాలలో భాగం గా శుక్రవారం ఆఫ్టేర్నూన్ యునైటెడ్ బ్రేవరీస్ యుబి పరిశ్రమ, బంటుపల్లి నందు డీజిల్ ట్యాంక్ ఫామ్ వద్ద, ట్యాంక్ నుండి డీజిల్ లీక్ లేదా ఫైర్ వలన అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయి, అగ్ని ప్రమాదాలు జరిగినపుడు వాటిని ఎలా నివారించాలి మరియు ప్రమాదం జారకుండా వారు తీసుకునే జాగ్రత్తలు గురించి మాక్ డ్రిల్స్ ను చేసి అగ్నిమాపక సిబ్బంది మరియు పరిశ్రమ సేఫ్టీ సిబ్బంది కలిసి అక్కడున్న పరిశ్రమ సిబ్బంది అందరికి అవగాహన కల్పించారు. చివరగా పరిశ్రమలలో సేఫ్టీ నకు సంబందించిన కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమం లో అగ్ని మాపాక అధికారి పైల అశోక్ ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేటలో 22ఎ సమస్య కానే కాదు

- పలాస ఆర్డీఓ గ్రంధి వెంకటేష్ సంచలన ప్రకటన - వారం రోజుల్లోగా సమస్య పరిష్కరిస్తానని హామీ

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట పట్టణంలో గల మహదేవిపేట, సూర్యవాస, పట్టుశాలివీధి, జలంత్ర జాలారీవీధి ప్రజలు 22ఎ సమస్యపై గత నాలుగు నెలలుగా కొనసాగిస్తున్న తీవ్ర పోరాటానికి శుక్రవారం జరిగిన సమావేశంలో పలాస ఆర్డీఓ గ్రంథి వెంకటేష్ అసలు అది సమస్యే కాదంటూ చెప్పిన మాటలు సంచలనంగా మారాయి. నాలుగు వీధుల ప్రజలంతా ఏకమై నాలుగు నెలలుగా ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖ అధికారుల వద్దకు వెళ్లి వినతిపత్రాలు అందించి తమ సమస్యకుమోక్షం కల్పించాలని మొర పెట్టుకున్న సంగతి తెల్సిందే. తీవ్రమైన ఈ సమస్యపై మాజీ మంత్రి డాక్టర్ గౌతు శ్యామసుందరశివాజీ, ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్, రెవెన్యూ అధికారులు, ప్రజలతో కలిసి శుక్రవారం సాయంత్రం సోంపేటలో సమావేశం నిర్వహించారు. ఈ సమస్యపై ఇద్దరు ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరైన ఆర్డీఓ వెంకటేష్‌కు సమస్యను వివరించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ ఈ సమస్యను తాను క్షుణ్ణంగా పరిశీలించానని రికార్డులు కూడా జాగ్రత్తగా పరిశీలించగా నాలుగు వీధులకు సంబంధించిన ఎల్‌పిఎం నెంబర్ 150 నిషేధిత భూముల (22ఎ) జాబితాలో లేదని పేర్కొన్నారు. 22ఎలో లేనప్పుడు ఇది సమస్య కాదని అన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వెబ్‌ల్యాండ్‌లో చిన్నపాటి సాంకేతిక కారణాల వల్ల ఎల్‌పిఎం నెంబర్ 150 సూచించకపోవడంతో రిజిస్ట్రేషన్లు ఇతరత్రా ప్రక్రియలు జరగడం లేదని స్పష్టం చేశారు. తాను ఈ సమస్యను వారం రోజుల్లోగా పరిష్కరించేందుకు హామీ ఇస్తున్నట్లు సభాముఖంగా ప్రకటించడంతో కరతాళ ధ్వనులు మిన్నంటాయి. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అప్పలస్వామి, రెవెన్యూ సిబ్బంది, జనసేన ఇన్‌చార్జ్ దాసరి రాజు, టీడీపీ నేతలు చిత్రాడ శ్రీనివాస్, సూరాడ చంద్రమోహన్, బీన ఆనంద్, చిత్రాడ శేఖర్, మద్దు రాజారావు, తెల్లి ధర్మారావు, పొందూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీస్తు శిలువ విజయోత్సవ యాత్ర

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట పట్టణంలో ఆంధ్రాబాపిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రీస్తు శిలువ విజయోత్సవ యాత్రను ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరులు డాక్టర్ అబ్రహమ్, డాక్టర్ వరదాన్, డాక్టర్ లీలా హదస్సా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. అంతకు ముందు చర్చిలో పెద్దసంఖ్యలో కాపరులు పాల్గొనగా ప్రార్ధన కార్యక్రమాలు నిర్వహించారు. లోక కళ్యాణం కోసం యేసుక్రీస్తు చేసిన శిలువ త్యాగాలను స్మరించుకుంటూ భక్తులందరూ ఈ యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాగ రత్నం, నవీన్‌కుమార్, జోగారావు, చిరంజీవ రావు, జనార్ధన్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళలుకు గాయాలు

విశాలాంధ్ర - మెళియాపుట్టి : వర్షానికి రోడ్డు పైనున్న మట్టి జారడం మూలంగా ద్విచక్ర వాహనం పై వెళుతుండగా ద్విచక్ర వాహనము జారిపోయి జరిగిన రోడ్డు ప్రమా దంలో మహిళలకు గాయాలయ్యాయి. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే మండలంలో గల మారడికోట గ్రామానికి చెందిన బార్నాన లక్ష్మీమ్మ అనే మహిళా ద్విచక్రవాహనం పై శుక్రవారం నాడు జాడుపల్లి నుంచి మారడికోట గ్రామానికి వెళుతుండగా అచ్చానాపురం గ్రామ సమీపంలో రోడ్డుకు అనుసరించి మట్టి వేయటంతో శుక్రవారం నాడు కురిసిన వర్షానికి మట్టి కరిగి ఆ మార్గంలో వెళ్తున్న ద్విచక్ర వాహనం జారి పోవటంతో లక్ష్మమ్మ నడుముకు గాయాలు అయినట్లు గ్రామస్తులు తెలియజేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే గాయాలైన లక్ష్మమ్మను 108 వాహనం పై టెక్కలి జిల్లా అసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

నిరుద్యోగ గ్రామీణ యువతకు ఉద్యోగ అవకాశాలు

విశాలాంధ్ర - ఆమదాలవలస : నిరుద్యోగ గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ డిపార్ట్మెంట్ ద్వారా కల్పిస్తున్నట్లు ఆముదాలవలస ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్ కార్యాలయము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీన దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 18 నుంచి 35 సంవత్సరాల వయసు కలి గిన గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం యూనిఫామ్ ఉచితంగా అందించడం జరుగుతుందన్నా రు. శిక్షణ కోసం సీడప్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతోపాటు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకములు ఏర్పాటు చేసుకోవడానికి సబ్సిడీ రుణాలు అంది స్తున్నట్లు తెలిపారు. ఆన్లైన్ ద్వారా అర్హత కలి గిన ఎస్సీ కులస్తులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ : ఏవో వెంకట్రావు

విశాలాంధ్ర - జలుమూరు : సారవకోట మండల పరిధి రైతులకు 50 శాతం రాయితీపై పచ్చి రొట్టె విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ అధికారి ఎస్ వెంకట్రావు తెలిపారు. జీలుగు 10 కేజీలు ప్యాకింగ్ 1230 రూపాయలు ప్రభుత్వ ధర కాగా 630 రూపాయలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. కట్టిజన్మ 10 కేజీలు ప్యాకింగ్ 1090 రూపాయలకు 545 రూపాయలు సబ్సిడీ ఉంటుందని తెలిపారు. పిల్లి పెసర 10 కేజీల ప్యాకింగ్ 1800 రూపాయలు కాగా 900 ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని ఆయన తెలిపారు. ఈ సదవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విత్తనాలు కావలసినవారు రైతు సేవ కేంద్రంలో ఉన్నటువంటి గ్రామ వ్యవసాయ సహాయకులకు సంప్రదించాలని వ్యవసాయ అధికారి వెంకట్రావు కోరారు.

కూటమి ప్రభుత్వంలో మత్స్యకారులకు అండ

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉందని బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గోవిందు పాపారావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మత్స్యకారులకు ఇచ్చిన మాట ప్రకారం 20 వేల రూపాయలు ఈనెల 26న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందించనున్నారని తెలిపారు. మత్స్యకార గ్రామాల్లో అధికారులతో ముమ్మరంగా తెప్పలు, బోట్లు రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయని, ప్రతి ఒక మత్స్యకారుడు ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకొని అధికారులకు సహకరించాలని కోరారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి భరోసా అందించాలని మంత్రి అచ్చేన్నాయుడు తెలిపారని, అలాగే పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కూడా నియోజకవర్గంలో మత్స్యకార గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా ఈ భరోసా అందించాలని అధికారులకు ఆదేశించారన్నారు.

రోడ్డుపైనే నిర్మాణం.. అయినా పట్టించుకోని వైనం

- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు

- మామూళ్ల మత్తులో టౌన్ ప్లానింగ్

విశాలాంధ్ర - ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధిలో రోజురోజుకి ఆక్రమణ ల పర్వం తీవ్రస్థాయికి చేరుకుంటుంది. మరికొందరు ఒక అడుగు ముందుకేసి తమకు ఏమాత్రం ఉపయోగ పడక పోయినప్పటికీ రోడ్డుపైనే అడ్డంగా గోడ నిర్మిస్తున్నారు. మున్సిపల్ ఆఫీస్ రోడ్డు ఎదురుగానే ఈ నిర్మాణం జరుగుతున్నప్పటికీ అధికారులు ధృతరాష్ట్ర పాలన చేస్తున్నారు. గతంలో అక్కడ నిర్మాణం చేపట్టినప్పుడు స్థాని కులు దాన్ని అడ్డుకున్నారు. కాలువ నిర్మాణానికి వారు కట్టే గోడ అడ్డొస్తుందని వివరించడంతో అ ప్పటి యజమాని నిర్మాణాన్ని నిలిపి చేశారు. ఇటీ వల పురుషోత్త పురం కు చెందిన ఒక వ్యక్తి ఆ ఇంటిని కొనుగోలు చేశారు. కొంతమంది నాయకు ల అండతో తనకు ఏమాత్రం ఉపయోగం లేనప్పటికీ రోడ్డును ఆనుకుని నిలువెత్తు గోడ నిర్మాణం చేపట్టారు. ఇదిలా ఉండగా ఇక్కడ ఆ భవనాన్ని 90 లక్షల రూపాయలకు కొనుగోలు చేసినట్లు తెలిసింది. దాని రిజిస్ట్రేషన్ కూడా లక్ష్మదు పేట కు చెందిన వ్యక్తి ఖాళీ స్థలంగానే పురుషోత్త పురా నికి చెందిన ఆసామికి రిజిస్ట్రేషన్ చేశారన్న వాదన వినిపిస్తుంది. రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మాణంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో దురాక్రమణ దారులు అధికార పార్టీ అండతో రోజు రోజుకు రెచ్చిపోయి ఫుట్ పాత్ లు చివరకు రహ దారులను కూడా ఆక్రమించారు. ఇంత జరుగు తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం కనీస చర్యలు చేపట్టడంలో కినుకు వహిస్తున్నారు. పత్రికలలో వచ్చిన కథనాలకు నోటీసులు జారీ చేశామంటూ వివరణ ఇస్తున్నారు. నోటీసులకు తగిన వివరణ మాత్రం అంతకుముందే పార్టీ కార్యాలయాలనుంచి ఫోన్ కాల్స్ వస్తున్నాయని వారు మదన పడుతున్నారు. తమకు ఎందుకు లే అంటూ ఆయనకాడపు మామూలు అందుకొని కిమ్మనడం లేదని తెలుస్తోంది. మామూళ్ల మత్తులో అధికారులు జోకుతున్నంతవరకు అక్రమ రా యుళ్ల వారు ఇష్టానుసారం నిర్మాణాలు చేస్తుం టారని స్థానిక ప్రజలు బహిరంగంగానే విమర్శి స్తున్నారు. ఇప్పటికే పలు అక్రమ నిర్మాణాలకు నోటీసులు అందిస్తే వారి వెనుకున్న రాజకీయ నాయకులు అధికారుల తీరుపై విరుచుకు పడు తున్నారని తెలుస్తుంది. ఇది ఇలా ఉండగా పట్టణంలో జరిగిన అక్రమాలపై అధికారుల చర్యలకు ఉపక్రమిస్తున్న సమయంలోనే పార్టీ కార్యాలయా లనుంచి బెదిరింపు ఆదేశాలు రావడంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో మున్సిపల్ అధికా రులు ఉన్నారని తెలుస్తుంది. అందుకనే అందిన కాడికి దోచుకుని ఏమి పట్టినట్టు వ్యవహరిస్తు న్నారని ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాలిటీ కార్యాలయం సాక్షిగా జరుగుతున్న కార్య కలాపా లకు కొంతమంది స్థానిక నాయకుల అండదండలు పూర్తిగా ఉన్నాయని తెలియ వచ్చింది. ఎమ్మెల్యే రవికుమార్ పలు సమావేశాల్లో రహదారులు విస్తారంగా ఉండాలని వాటిని సిమెంట్ దారులు గా నిర్మించేందుకు తగిన నిధులు సమకూరుస్తా మని బహిరంగంగా చెబుతున్నప్పటికీ లోలోపల మాత్రం ఇటువంటి దురాక్రమణలు, అక్రమ నిర్మా ణాలు నిత్య కృత్య మవుతున్నాయి. ఏది ఏమైన ప్పటికీ ప్రజా అవసరాల కోసం రహదారులను మూసివేసిన వారిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

పంచాయతీ కార్యదర్శిగా కిషోర్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర - మెళియాపుట్టి : మెళియాపుట్టి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కిషోర్ పదవీ బాధ్యతలు చేపట్టారు. పాతపట్నం మేజర్ పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తు పదోన్నతి పై గ్రేడ్ -3 కార్యదర్శిగా మెలియాపుట్టి పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పంచాయతీ ఇంచార్జి కార్యదర్శిగా చింతల అప్పారావు అదనపు బాధ్యతలు చూస్తున్న నేపథ్యంలో గ్రేడ్ 3 పంచాయతీ కార్యదర్శిగా కిషోర్ బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ కార్యదర్శి కిషోర్‌తో పాటు డిజిటల్ అసిస్టెంట్ యుగంధర్, వెల్ఫేర్ అసిస్టెంట్ దిలీప్, మహిళా పోలీసు భారతి, ఏఎస్ఎం సుజాత తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్య భర్తలకు గాయాలు

విశాలాంధ్ర - పలాస : మండలం రెంటికోట గ్రామ సమీప మలుపు వద్ద గురువారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అల్లుకోల గ్రామంలో పశు వైద్యునిగా విధులు నిర్వహిస్తున్న రవి తన భార్యతో పాటు ద్విచక్ర వాహనంపై వస్తుండగా రాంగ్ రూట్లో వచ్చిన ఒడిస్సా కు చెందిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన భార్యాభర్తలను చికిత్స కోసం పలాస ఆస్పత్రికి తరలించారు. కాశిబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగు పాటుకు ఆవు మృతి

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలం మర్రిపాడు గ్రామంలో శుక్రవారం పిడుగుపాటుకు బొల్ల సుజాతమ్మకు చెందిన పాడి ఆవు మృతి చెందింది. గ్రామ సమీపంలో మేతకు విడిచి పెట్టిన సమయంలో వర్షంతో పాటు పిడుగు పడడంతో మృత్యువాత పడిందని పశు వైద్యాధికారి డాక్టర్ మెట్ట పాపారావు దృష్టికి తీసుకెళ్తామని అధి కారులు తెలిపారు. ఆవు విలువ సుమారు 30 వేల రూపాయలు ఉంటుందని బాధితురాలు సుజాతమ్మ తెలిపారు.

సారవకోటలో చిన్నపాటి వర్షం

విశాలాంధ్ర - జలుమూరు : మండల కేంద్రం సారవకోటలో శుక్రవారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికి ప్రజలు ఆనంద వ్యక్త పరిచారు. గత కొద్ది రోజులుగా ఎండ తీవ్రతతో ఇబ్బంది పడిన ప్రజలు ఒకసారి అకాల వర్షం కురవడంతో ప్రజలు ఎంతో ఆనందపడ్డారు. చిన్నపాటి వర్షం అయినా అది ఎంతో చల్లదానాన్ని ఇచ్చిందని పలువురు సంతోష్ రక్తపరిచారు.

శిథిల భవనాలకే ముస్తాబులా?

విశాలాంధ్ర - జలుమూరు : మండల కేంద్రం సారవకోట ప్రభుత్వ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకుందని అనేకమార్లు పత్రిక ప్రకటనలు ప్రజాప్రతిని దృష్టికి ఈ సమస్య ఉన్న పట్టించు కోకుండా శిదిల భవనాలకు ముస్తాబు చేయడం అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనంలో సుమారు 100కు పైగా పిల్లలు ఉన్నారు. చిన్నపాటి వర్షం వస్తే గదుల్లో నీరుకాడం గోడలపై మూడు రోజుల వరకు చెమ్మ ఉండడం జరుగుతుంది. ఇటువంటి శిథిల భవనాలకి ముస్తాబు చేయడంపై పలువురు పలు విధాల విమర్శలు వినిపిస్తున్నారు.

24 నుంచి ఆమదాలవలసలో టీ 20 జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో టీ 20 జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఎంఎల్ఏ కప్పు నిర్వహిస్తున్నట్లు సీఎంసీసీ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు తమ్మినేని విద్యాసాగర్ (తంబి) తెలియజేశారు. శుక్రవారం మైదానంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ టోర్నమెం ట్‌ను ఈ ఏప్రిల్ 24వ తేదీ నుంచి మే నెల 25వ తేదీ వరకు నెల రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 22వ తేదీన బహిరం గంగా పాల్గొన్న టీములను లాటరీ తీయబడునని వివరించారు. 22వ తేదీ మధ్యాహ్నం నాలుగు గంటల వరకు ఆసక్తి కల టీములు వారి ఎంట్రీనిన మోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు 15 టీంలు వచ్చాయని తెలిపారు. టోర్నమెంట్ నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చురుగ్గా నిర్వహిస్తున్నారు. పోటీలు నిర్వహణ ఉదయం 9 నుంచి మ్యాచ్ పూర్తయ్యేంత వరకు జరుగుతా యని తెలియజేశారు. టి20 నాకౌట్ మ్యాచ్లుగా పాల్గొన్న టీంలు గుర్తించాలని తెలిపారు. ఆంధ్ర క్రికెట్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ టోర్నమెంట్ ఎంపై ర్లు ఇక్కడ న్యాయ నిర్ణయతలుగా వ్యవహరిస్తారు అని వివరించారు. క్రీడాకారులు ఆడుకునేందుకు వీలుగా మైదానాన్ని, పిచ్‌ను చదును చేసినట్లు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలను ప్రతీ ఏడాది నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగానే ఈ ఏడాది జిల్లా స్థాయిలో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఎన్ ఈశ్వరరావు, గంధం గిరి, బలివాడ శ్రీను, ఎస్.సురేష్ ఎస్ఎంఎస్, మెట్ట నాగు, కాత్రసుధా, బి రమేష్ అసోసియేషన్ తెలియజేసింది.

ఐఐటితోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

మెంటర్స్ అకాడమీ ఐఐటి ఫౌండేషన్ డైరక్టర్ మోహన్

విశాలాంధ్ర - నరసన్నపేట : ఐఐటీతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని విజయ వాడకు చెందిన మెంటర్స్ అకాడమీ ఐఐటీ ఫౌండేషన్ డైరక్టర్, జి.మోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీ జ్ఞానజ్యోతి స్కూల్ ఆవరణలో 10వ తరగతి పరీక్షలు వ్రాసిన విద్యార్థులకు స్కూల్ మేనేజ్‌మెంట్ ప్రతి నిధులు ఐఐటిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఐటి ఫౌండేషన్ డైరక్టర్, మోహన్ మాట్లాడుతూ ఐఐటిలో ఉత్తీర్ణత సాధించినట్లయితే ఎన్నో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, విద్యార్థులకు స్వంతమవుతాయన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు డైరక్టర్, మోహన్, స్కూల్ యాజమాన్యం ధృవపత్రాలు, బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ జ్ఞానజ్యోతి స్కూల్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, బోర రామారావు, వెలమల భాస్కరరావు, తర్ర రామకృష్ణ, పాగోటి లక్ష్మీ, బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాగోటి రామకృష్ణ, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

సర్పంచ్ జోగారావుకు మాతృవియోగం

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం పలాసపురం గ్రామ సర్పంచ్ తడక జోగారావుకు మాతృవియోగం జరిగింది. గురువారం రాత్రి జోగారావు తల్లి తడక అన్నపూర్ణమ్మ (85) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ తనువు చాలించారు. రాత్రంతా మృతదేహం వద్ద భజన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఉదయాన్నే అంతిమయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో వైకాపా సీనియర్ నేత, కంచిలి జెడ్పీటీసీ ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు హాజరై అన్నపూర్ణమ్మ పాడెను మోయడం విశేషం. పలాసపురం గ్రామస్తులు, సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం, కవిటి మండలాలకు చెందిన అనేక మంది వైకాపా శ్రేణులు పెద్ద సంఖ్యలో అంతిమ యాత్రలో పాల్గొనగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలాసపురంలో విషాదఛాయలు అలముకున్నాయి. అన్నపూర్ణమ్మ కోడలు, జోగారావు సతీమణి తడయ యశోద ప్రస్తుతం జెడ్పీటీసీగా కొనసాగుతున్న విషయం తెల్సిందే.

రెండేళ్ళయినా వీఆర్వోలకు ప్రమోషన్లు కల్పించలేదు

ఏపీ రాష్ట్ర వీఆర్వోల సంఘ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రరాజు

విశాలాంధ్ర - నరసన్నపేట : రాష్ట్రంలో పనిచేస్తున్న గ్రేడ్-2 విఆర్వోలకు గ్రేడ్-1 విఆర్వోలుగా 166జీవో ఇచ్చి నేటికి రెండు సంవత్సరాలు గడుస్తున్నా శ్రీకాకుళం జిల్లాలో సుమారు 93మందికి గ్రేడ్-1 విఆర్వోలుగా ప్రమోషన్లు కల్పించలేదని ఆంధ్రప్రదేశ్ విఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, భూపతిరాజు రవీంద్రరాజు అన్నారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంటూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1200 గ్రేడ్-1 పోస్టులు ఖాళీగా ఉండటం, వాటిని గ్రేడ్-2 విఆర్వోలతో భర్తీ చేయకపోవటం వలన విఆర్వోలు తీవ్ర పని ఒత్తిడితో ఇప్పటి వరకూ ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా శ్రీకాకుళం జిల్లాలో జిల్లా ఉన్నత స్థాయి అధికారులు చొరవ తీసుకొని, అన్ని జిల్లాల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలో ఖాళీ అయిన గ్రేడ్-2. వీఆర్వోల స్థానంలో అర్హులైన వీఆర్ఏలకు వెంటనే గ్రేడ్-2 వీఆర్వోలుగా ప్రమోషన్లు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ విఆర్వోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మారెల్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధి కోసం పట్టించుకోరా..?

విశాలాంధ్ర - మందస : సీతంపేట గిరిజన అభివృద్ధి సంస్థ సబ్ డివిజన్ కేంద్రమైన మందస ప్రాంతంలో ప్రధాన రహదారులైన తారు రోడ్లు దశాబ్దాలు తరబడి అభివృద్ధి చెందలేదు ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు హామీలు ఇవ్వడం ఆ తరువాత మరచి పోవడం అనేది ఆనవాయితీగా మారిందని ప్రజలు అంటున్నారు మందస సంస్థానాన్ని జమీందారులు పాలించిన చరిత్ర ఉంది. రాజుల పాలన కాలంలో గుర్తింపు ఉన్న మందస ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి మందస నుంచి బాలిగాం ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా హరిపురం వరకు ఉన్న ఆరు కిలోమీటర్లు తారు రోడ్డు అధ్వానంగా తయారైంది ఈ రోడ్డు మీదుగా ప్రయాణం చేయాలంటే ఇరుకుగా ఉంటుంది. ఎదురుగా వచ్చే వాహనాలకు పక్కకు తప్పుకోవాలంటే నానా కష్టాలు పడాల్సిందే.ఈ రోడ్డు మీదుగా రోజుకు వందలాది వాహనాలు పర్లాకిమిడి వైపు వెళ్తుంటాయి.రోడ్డు వెడల్పు లేకపోవడం ఇరుకుగా ఉండటంతో పాటు ఎదురెదురుగా వచ్చే వాహనాలు పక్కకు తప్పుకోవాలంటే కష్టతరంగా ఉంటుంది. ఈ రోడ్డు మధ్యలో మూడు చోట్ల సునాముది ప్రధాన సాగునీటి కాలువలు ఉన్నాయి. ఈ కాలువలపై బ్రిటిష్ పాలకుల పాలనలో నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరుకొని దశాబ్దాలు గడుస్తున్నాయి.ఈ వంతెన లకు ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు కూడా పూర్తిగా పాడై పోయాయి. వంతెనలు ఇరుకుగా ఉండటంతో తరచూ ఇక్కడ ప్రమాదాలు జరిగి అనేక మంది మరణిస్తున్నారు. కాలం చెల్లిన వంతెనలు మీదుగా బస్సులు లారీలు ఇతర వాహనాలు వెళ్తున్నాయి.ఇక రోడ్డు మధ్యలో కూడా చిన్న చిన్న కాలువలపై ఉన్న కల్వర్టులు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ రోడ్డు ఇరుకుగా ఉండటంతో పగలు రాత్రులు కూడా తేడా లేకుండా రోడ్డు ప్రమా దాలు జరిగి తరచు వాహన చోదకులు మృత్యువాత పడటం, అంగవైకల్యం పాలవ్వడము వంటి సంఘటనలు జరుగుతున్నాయి. మందస నుంచి హరిపురం వరకు ఉన్న ప్రస్తుత తారు రోడ్డును డబుల్ రోడ్డు గా నిర్మించాలని రోడ్డు మధ్యలో డివైడర్ ను ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్ళుగా ప్రజలు కోరుతున్నప్పటికీ ప్రభుత్వాలు మారుతున్న నిధులు మంజూరు కావడం లేదు. అదే విధంగా మెళియాపుట్టి మండలం పట్టుపురం జంక్షన్ నుంచి మందస మండలం హంసరాలి గాటి జంక్షన్ వరకు మాత్రమే తారు రోడ్డు అభివృద్ధి పనులు 8 సంవత్సరాల కిందట జరిగాయి. హంసరాలి నుంచి మందస మీదుగా కొత్తపల్లి జాతీయ రహదారి వరకు ఉన్న 12 కిలోమీటర్లు దూరం గల రోడ్డును అభివృద్ధి చేయకుండా వదిలేశారు. ఈ రోడ్డును కూడా డబుల్ రోడ్డు గా నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని ఈ ప్రాంతం ప్రజలు కోరుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారు. ఈ రోడ్డు అభివృద్ధి చేయకపోవడంతో రోడ్డు గతుకుల మయంగా, రోడ్డు ప్రమాదాలకు ఈ రహదారి నిలయంగా తయారైంది. ప్రధాన రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వము ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.